ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీసుల ముట్టడి

- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తల ధర్నా
- క్యాంప్ కార్యాలయాల్లో వినతిపత్రాల అందజేత

మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 10: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ఆశ వర్కర్లు ముట్టడించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తల డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతంగా కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం వివిధ డిమాడ్లతో కూడిన వినతిపత్రం ఎమ్మెల్యే పీఏకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి చంద్రకాంత్, నాయకులు సౌజన్య, సునీత, అనురాధ, మంజుల, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో..

దేవరకద్ర, జనవరి 10: ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు చెందిన ఆశ కార్యకర్తలు దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రేవంత్ రెడ్డి ప్రతిపక్షనేతగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆశకార్యకర్తలు తమ సమస్యలను పరిష్కరించాలని ధర్నా చేస్తుంటే అక్కడికొచ్చి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించి వారికి ప్రతినెలా రూ.18వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా.. సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చేందారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు చెందిన ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రూ.18వేల వేతనం చెల్లించాలి

మక్తల్, జనవరి 10: రాష్ట్ర వ్యాప్తంగా ఆశ కార్యకర్తలకు పని ఒత్తిడిని తగ్గించి వారికి కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మక్తల్ మున్సిపాలిటీలోని ఎమ్మెల్యే శ్రీహరి ఇంటిని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పేట జిల్లా అధ్యక్షుడు వెంకట్ రాంరెడ్డి ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో గోవింద్‌రాజ్, రమేశ్, గౌరమ్మ, మహేందర్, యశోద, పద్మ, ఇందిరా, బాలమణి పాల్గొన్నారు.

జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడి

జడ్చర్ల, జనవరి 10: జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆశ వర్కర్లు ముట్టడించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి తెలుగుసత్తయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు అల్వాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సావిత్రి, అమృత, శివలీల, నిర్మల, నర్సమ్మ, సునీత, అరుణ, జ్యోతి, మయూరి, నర్సమ్మ, తదితరులు ఉన్నారు.

జడ్చర్లలో ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

దేవరకద్ర ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఆశలు

మక్తల్ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు

కేటీఆర్‌ను కలిసిన రాములునాయక్

కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాములునాయక్

నవాబ్‌పేట, జనవరి 10: మండలంలోని ఊరంచుతండాకు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు, ఉపసర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లావుడ్యా రాములునాయక్ శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాములునాయక్ ఫోన్‌లో నమస్తేతెలంగాణతో మాట్లాడుతూ.. కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి ఎన్ని కేసులు పెట్టి నా, ఎన్ని కుయుక్తులు పన్నినా ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారని తెలిపారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో అణా పైసా కూడా అవినీతి జరగలేదని, కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇలాంటి చిల్లర పన్నాగాలు పన్నుతున్నారన్నారు. యువనేత కేటీఆర్‌కు బీఆర్ఎస్ సైన్యం అండగా ఉంటుందని చెప్పారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్ నాయక్ ఉన్నారు.

పర్యావరణానికి హానిలేకుండా నడిపించాలి

- అదనపు కలెక్టర్ మోహన్‌రావు

బాలానగర్, జనవరి 10: పర్యావరణానికి ఎలాంటి హాని కలుగకుండా పరిశ్రమలను నడిపించాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు పరిశ్రమల నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మోతీగణపూర్ శివారులోని నవదుర్గ స్పాంజ్‌ఐరన్ పరిశ్రమ రెండో ప్లాంట్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారుల సూచనలు మేరకు పరిశ్రమ నిర్వహణలో కాలుష్య నివారణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన గ్రామస్తులు ప్రతాప్‌రెడ్డి, అరుణ్‌కుమార్ రెడ్డి, యాదిరెడ్డి, కిషన్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, నర్సింహారెడ్డి తదితరులు మాట్లాడుతూ.. పరిశ్రమలో మోతీగణపూర్, గంగాధర్‌పల్లి తదితర గ్రామాల్లోని యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, పరిశ్రమ కాలుష్యాన్ని నియంత్రించే పరికరాలను వినియోగించాలని, పరిశ్రమ పరిసరాలు, రహదారుల వెంట చెట్లు నాటాలని కోరారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి

బాలానగర్, జనవరి 10: రహదారి ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ జానకి పోలీసులకు సూచించారు. శుక్రవారం బాలానగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, మండలంలోని ప్రజలతో మర్యాదగా మసలుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, ఫోక్సో కేసులు, బాలికలు, మహిళలపై వేధింపులు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మాదకద్రవ్యాలను పూర్తి స్థాయిలో నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై తిరుపాజీని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో క్యూర్ కోడ్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన

నారాయణపేట రూరల్, జనవరి 10: మండలంలోని జాజాపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై ఏఎస్సై బాలయ్య అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్ఎంఐఎంఎస్ యూనివర్శిటీలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు

జడ్చర్ల, జనవరి 10: మండంలోని పోలేపల్లి సెజ్‌లో ఉన్న ఎన్ఎంఐఎంఎస్ యూనివర్శిటీలో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎన్ఎంఐఎంఎస్ యూనివర్శిటీ నిశ్చయ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి స్టేట్ చైర్మన్ అజయ్‌మిశ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తలసేమియా పిల్లలను ఆదుకోవడం మనందరి బాధ్యత అన్నారు. జిల్లాలో 175మంది తలసేమియా బాధితులు ఉన్నారని, వారికి తరచుగా 20రోజులకు ఒకసారి రక్తం అందిచాల్సిన అవసరం ఉంటుందన్నారు. యువత ప్రతి మూడునెలలకు ఒకసారి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అశినిదేశ్‌పాండే, డిప్యూటీ రిజిస్టార్ డాక్టర్ మహేశ్‌కుమార్, డాక్టర్ శ్రీవిదారాఘవన్, స్కూల్‌ఆఫ్ బిజినెస్ డాక్టర్ సుస్మితమిశ్రా, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, తిరుపతిరెడ్డి, బాబుల్‌రెడ్డి, నిక్షయ్ ఆర్గనైజర్ ఉదయ్‌కుమార్, నిధి పాల్గొన్నారు.

విద్యార్థుల గురుతర బాధ్యత

ఉపాధ్యాయులైన విద్యార్థులు

దేవరకద్ర, జనవరి10: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. కలెక్టర్‌గా దీపిక, జేసీగా నవ్య, డీఈవోగా శ్రీవల్లి, డిప్యూటీ డీఈవోగా కావేరి, ఏఎంవోగా రాణి, ఎంఈవోగా భాన్, స్పెషల్ ఆఫీసర్‌గా నందిని, ఆదర్శ పాఠశాల చైర్మన్‌గా బీజే వైష్ణవి, హెచ్‌ఎంగా భవానీతోపాటు 50మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్రమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONOURABLE
IInd Additional JUNIOR CIVIL JUDGE :
AT : MAHABUBNAGER
O.S. No. 539 of 2023
Between:
Ryagari Madhavi @ Pyata Madhavi ...Plaintiff
AND
Ryagari Vijayabhasker Reddy and others ...Defendants
SUMMONS
To
I, Ryagari Vijayabhasker Reddy, S/o. Late R.Neela Reddy, Aged 52 years, Occ: Agriculture.
2. Ryagari Saroja @ Sarojamma, W/o. Late Neela Reddy, Aged 75 years, Occ: Agriculture. Both are R/o. H.No. 1-1, Gandeed (V&M), Mahabubnager District-509 337.
That the above case is filed by the plaintiff against you for the relief of perpetual injunction in respect of agricultural land bearing Sy.No. 24 (Telugu Alphabets with bye numbers) admeasuring Acs. 2-36 Gts., situated at Gandeed Revenue Village and Mandal, Mahabubnager District. The said case is posted on **23-01-2025** for your appearance and written statement either personally or through your advocate at 10.30 A.M. Else the matter will be decided as per law in your absence. Hence, this Notice.
Further take notice that the plaintiff also filed interim application bearing I.A.No. 322 of 2023 under Order 39 Rule 1 & 2 of C.P.C. in this case.
//By order of the Court//
Sd/- D.AMARENDER REDDY, K.MOHAN, J.RAMESH & K.RAMESH, Advocates
H.No. 17-1-382-R-96-B, RTC Officers Colony, Champapet, Hyderabad- 500 079,
Cell No. 9246580655.
Date: 10-01-2025, Hyderabad.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

బాలానగర్, జనవరి 10: చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తిరుపాజీ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి వేడుకల్లో భాగంగా పతంగులు ఎగురవేసే వారికి వ్యాపారులు చైనా మాంజా దారాన్ని విక్రయిస్తే పోలీసుశాఖ పరిధిలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చైనా మాంజా దారం వినియోగించడంతో పక్షులు, మనుషులకు ప్రమాదమన్నారు. పతంగులు విశాలమైన స్థలాల్లో ఎగురవేయాలని, తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తుండాలని సూచించారు. చైనా మాంజా ఎవరైనా విక్రయిస్తున్న పక్షంలో తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బీసీటీఏ జిల్లా కార్యవర్గానికి అభినందన

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 10: బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బీసీటీఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని డీఈవో ప్రవీణ్‌కుమార్ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పదో తరగతి ఫలితాల్లో జిల్లాను గతేడాది కంటే ముందు వరసలో నిలిపేలా ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు కృషిచేయాలని కోరారు. అనంతరం బీసీటీఏ క్యాలెండర్-2025ను డీఈవో చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేందర్, ధనుంజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుప్రసాద్‌గౌడ్, జిల్లా కోశాధికారి మల్లేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ఊట్కూర్, జనవరి 10: మాజీ జెడ్పీటీసీ సూర్యప్రకాశ్ రెడ్డి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలకలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. నాయకులు, అభిమానుల సమక్షంలో కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో శక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేశ్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

కృష్ణ, జనవరి 10: మండల కేంద్రంలోని జాన సంగమ పాఠశాలలో శుక్రవారం రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే రైతులుగా మారి పంట సాగు మొదలు నుంచి మార్కెట్‌కు పంటను తీసుకెళ్లే వరకు అన్నదాతలు పడే కష్టాన్ని కండ్లకు కనపడ్డట్టు చూపిస్తూ ప్రత్యేక వ్యవసాయ ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలోపాఠశాల కరస్పాండెంట్ శివరాజ్‌పాటిల్ , ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట, జనవరి 10 : జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 108 అంబులెన్స్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 108 అంబులెన్స్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని వివిధ రకాల పరికరాలు, వాటి పనితీరు, రికార్డులను పరిశీలించారు. కాల్ సెంటర్ నుంచి ఎమర్జెన్సీ కేసు వచ్చిన వెంటనే అప్రమత్తంగా ఉండి వెంటనే బాధితులను దవాఖానకు తరలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎక్స్‌క్యూటివ్ రాఘవేందర్, ఎమర్జెన్సీ టెక్నీషియన్లు, పైలెట్లు పాల్గొన్నారు.

పీయూ ఫార్మసీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 10: పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్న కోమటి సోమేశ్వర్‌కు డాక్టరేట్ వరించినట్లు పీయూ వైస్‌ఛాన్స్‌లర్ జీఎన్.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పీయూ పరిపాలన భవనంలోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోమేశ్వర్‌ను వీసీ అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బీజు పట్నాయక్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ ఈ.బానోజీరావు పర్యవేక్షణలో 'ఫార్ములేషన్ డెవలప్‌మెంట్, ఆప్టిమైజేషన్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ గ్యాస్ట్రో-రీటేంటివ్ డ్రగ్ డెలివరీ సిస్టం ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారని అన్నారు. ఫార్మసీ విభాగాధిపతి ప్రభాకర్‌రెడ్డి, రవికాంత్, శైలేశ్, ఈశ్వర్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పర్వతాలు, వెంకటేశ్, స్వాతి, రామ్మోహన్, సురేశ్, పీయూ పీఆర్వో రవికుమార్ తదితరులు అభినందించారు.

సోమేశ్వర్‌ను అభినందిస్తున్న పీయూ వీసీ, అధ్యాపకులు

బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో యువజనోత్సవాలు

బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్

జడ్చర్ల, జనవరి 10: పట్టణంలోని బీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజనోత్సవాలను నిర్వహించారు. అదేవిధంగా జడ్చర్లలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లిటరరీ, కల్చరల్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భాషా సాంస్కృతికోపన్యాస, ముగ్గులు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ సుకన్య మాట్లాడుతూ.. మహనీయులు రాసిన పుస్తకాలను విద్యార్థులు చదివి జ్ఞానాన్ని పొందాలని సూచించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. జడ్చర్ల ప్రభుత్వ బాలికల కళాశాలలో వివేకానంద జయంతిని ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కారు, లారీని ఢీకొన్న ట్రావెల్‌బస్సు..

- ఇద్దరు మృతి, 15 మందికి గాయాలు

జడ్చర్ల జాతీయరహదారిపై రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ట్రావెల్‌బస్సు

జడ్చర్ల, జనవరి 10 : జడ్చర్ల 44వ జాతీయరహదారిపై శుక్రవారం అర్ధరాత్రి లారీ, కారును ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరువ్యక్తుల అక్కడికక్కడే మృతి చెందగా 15 మందికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాలు ప్రకారం.. హైదరాబాద్ నుంచి అరుణాచలం వైపు వెళ్తున్న జై భారత్ ట్రావెల్ బస్సు జడ్చర్ల ఫ్లైవర్ దాటిన తర్వాత త్రిస్టార్ హోటల్ సమీపంలో ముందు వెళ్తున్న కారును ఢీకొని అ పక్కనే ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టింది. దాంతో లారీ బోల్తా పడగా బస్సులోని ఇద్దరు ప్రయాణికుడు నూర్‌తో పాటు బస్సు క్లీనర్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. బస్సు, కారులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు. మృతుల పూర్తి వివరాలు తెలియరాలేదు. విషయం తెలుసుకున్న జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బస్సులో నుంచి బయటకు తీసి జడ్చర్ల ప్రభుత్వ దవాఖానకు మార్చురికి తరలించారు. గాయపడిన వారిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ ఘటనతో 44వ జాతీయరహదారిపై కొంత సమయం పాటు ట్రాఫిక్‌జాం అయింది. రోడ్డుపై ఉన్న వాహనాలను పక్కకు తొలగించడంతో వాహన రాకపోకలు సాఫీగా జరిగాయి. ప్రమాదానికి గల కారణాలు, మృతులు, గాయపడిన వారి వివరాలు తెలియరాలేదు.

నిబద్ధతతో పనిచేయాలి: డీఈవో

నారాయణపేట రూరల్, జనవరి 10 : నిబద్ధతతో పనిచేసి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని డీఈవో గోవిందరాజులు అన్నారు. జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాలలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదన్నారు. ఏఎంవో విద్యాసాగర్ మాట్లాడుతూ శిక్షణలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. రెండు రోజుల శిక్షణలో 148 మంది ఎస్‌జీటీ, 90 మంది స్కూల్ అసిస్టెంట్లు పాల్గొన్నారన్నారు. ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు కూడా శిక్షణ ఇస్తామని తెలిపారు. అనంతరం సీఆర్‌పీలుగా పనిచేసి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు పొందిన రమేశ్, ఉసేనప్పను డీఈవో సన్మానించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జడ్చర్ల, జనవరి 10: మండలంలోని పోలేపల్లికి చెందిన నర్సింహులుకు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించారు. నర్సింహులుకు చెందిన గుడిసె ప్రమాదవశాత్ దగ్ధమై ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రూ.5వేల ఆర్థికసాయంతోపాటు క్వింటా బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేయాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించగా.. బీఆర్ఎస్ నాయకులు పోలేపల్లికి వెళ్లి నర్సింహులుకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీవైస్ చైర్మన్ యాదయ్య, పీఏసీసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ఇమ్మూ, శంకర్‌నాయక్, కరాటేశ్రీను, తిరుపతిరెడ్డి, అశోక్, రఘు ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తికి జైలు శిక్ష

నవాబ్‌పేట, జనవరి 10: మండల కేంద్రానికి చెందిన మాందువాద రాంచంద్రయ్య మద్యం తాగి బైక్ నడిపినందుకుగానూ మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. రాంచంద్రయ్య మద్యం తాగి బైక్ నడుపుతుండగా.. పోలీసుల తనిఖీలో పట్టుబడగా.. శుక్రవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శశిధర్ ఎదుట ప్రవేశపెట్టగా.. రూ.5వేల జరిమానా, 2రోజుల జైలు శిక్ష విధించగా.. రాంచంద్రయ్య రూ.5వేల జరిమానా కట్టనందుకు మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు వివరించారు.

అందుబాటులో పీఎస్‌బీ

ఊట్కూర్, జనవరి 10: మండలకేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో పాస్పరస్ సొల్యూబిలియసింగ్ బాక్టీరియా (పీఎస్‌బీ) 7.77 క్వింటాళ్లు అందుబాటులో ఉంచామని, రైతులకు యాభై శాతం రాయితీపై కేజీ బస్తా ధర రూ.20 అందిస్తున్నామని ఏవో గణేశ్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. పీఎస్‌బీ ద్వారా రైతులు పొలాల్లో డీఏపీ వినియోగాన్ని తగ్గించుకోవచ్చని, రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్సు కాపీని కార్యాలయంలో అందించి కొనుగోలు చేయాలని సూచించారు.

ముందస్తు సంక్రాంతి సంబురాలు

- ఉట్టి పడిన గ్రామీణ వాతావరణం
- ముగ్గుల పోటీలు, భోగి మంటలతో సందడి
- హరిదాసుల వేషధారణలతో విద్యార్థులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, జనవరి 10: విద్యాసంస్థల్లో శుక్రవారం సంక్రాంతి సంబురాలు జరుపుకొన్నారు. సెలవుల నేపథ్యంలో ముందస్తుగానే పిల్లలు, పెద్దలు, అధికారులు, అనధికారులు, యాజమాన్యాలు నూతన వస్త్రాలు ధరించి పిండి వంటలు, సంప్రదాయ వేషాధారణలతో అలరించారు. ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ.. పతంగులు ఎగరవేసి సందడి చేశారు. గొబ్బెమ్మల నడుమ భోగి మంటలతో చిన్నారుల తలపై రేగిపళ్లు పోసి ఆశీర్వదించారు. హరిదాసు వేషధారణలతో విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో సంబురాలకు పీయూ వీసీ జీఎన్.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై చైర్మన్ కేఎస్.రవికుమార్‌తో కలిసి భోగి మంటను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, డైరెక్టర్ సుజీవన్‌కుమార్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పరీక్షల నిర్వహణ అధికారి సందీప్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య బ్రాంచి-2లో బొమ్మల కొలువు, భోగిపళ్లు, భోగి మంటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీఎం భాస్కర్ రెడ్డి, కోఆర్డినేటర్ రఘుబాబు, ప్రిన్సిపాల్ శ్రీధర్, మహేశ్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య బ్రాంచి-2 విద్యార్థులు, ఉపాధ్యాయులు

జడ్చర్లలో..
ధన్వాడ మండలంలో..
జేపీఎన్‌సీఈలో..

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

దేవరకద్ర, జనవరి 10: మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థులు సంక్రాంతి సంబురాలు జరుపుకొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, డోకూర్ సమీపంలోని తపోవన్ పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిరంజన్ రెడ్డి ఉపాధ్యాయులు చంద్రయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మందిపల్లిలో సంక్రాంతి ఆకారంలో..

మరికల్ మండలంలో..

మరికల్, జనవరి 10: మం డల కేంద్రంలోని ప్రాథమిక, రేయిన్ బో పాఠశాలలో విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేశారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో మనోరంజనీ, హెచ్‌ఎంలు నాగరత్నమ్మ, సత్యాలక్ష్మి పాల్గొన్నారు.

సంక్రాంతి ఆకారంలో ప్రదర్శన

ధన్వాడ, జనవరి 10 : మండలంలోని మందిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు సంక్రాంతి ఆకారంలో కూర్చొని ఆకట్టుకున్నారు. కొండాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ముగ్గులు వేశారు.

అడ్డాకుల మండలంలో..

మూసాపేట(అడ్డాకుల), జనవరి 10: మండలంలోని తిమ్మాయిపల్లి తండా ఎంపీయూపీఎస్‌లో శుక్రవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.